


# శ్రీదరోళ్ల మిద్దె మీద కంబైన్డు స్టడీ

ఎట్టా ప్రిపరేషను హాలిడేసు యిచ్చేసినారు గదా ఇళ్ల దెగ్గిర ఉత్తగా ఒక్కళ్లమే కూచుని చదువుకుంటే ఏమొస్తుంది, ఎండలు మొదలైన ఈ మార్చి నెల కాలాన మిద్దెల మీద బల్బులు లాక్కొని హాయిగా చల్లగాలిలో కంబైన్డు స్టడీ చేస్తేనే గదా మజా అనుకున్నాము మేము.

ఆ మజా పొందడం ఎట్టా అనే దిగులు పట్టుకునింది మాకు.

'మావా. మీది మిద్దె గదరా. మీ మిద్దె మీద కంబైన్డు స్టడీ చేద్దాముర' అన్నాడు కాండూరి మురళీగాడు కేతిరెడ్డి శ్రీదరుగాడితో.

'మీ యింట్లో కుదరకపోతే కదీరోళ్ల మిద్దె మీదన్నా ప్లాను చేయాలిరా' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

అది విని నేనూ శ్రీదరుగాడూ మొకామొకాలు చూసుకున్నాం.

మా మిద్దెమీద గానీ, శ్రీదరోళ్ల మిద్దెమీద గానీ కంబైన్డు స్టడీకి ప్రాబ్లము లా. ప్రాబ్ల

మల్లా ఆడైనాగానీ ఈడైనాగానీ ముగ్గురు మాత్రమే కంబైన్డు స్టడీ చెయ్యగలరు. శ్రీదరోళ్ల మిద్దె మీద కంబైన్డు స్టడీకి వాళ్ల నానమ్మ నన్ను రానీదు. మా యింటి మీద కంబైన్డు స్టడీకి వాణ్ణి పంపియ్యదు.

'ఇదిరా ప్రాబ్లము' అన్నాడు శ్రీదరుగాడు.

'అవునురా. శ్రీదరోళ్ల నానమ్మ కంటంలో ప్రాణం ఉండగా మన నలుగురం కలిసి కంబైన్డు స్టడీ చెయ్యలేమురా. ఇక ఈ జన్మకి యింతేరా' అన్నాను నేను.

నలుగురం కాసేపు కిందా మీదా పడినాం.

శ్రీదరుగాడు మెడని ఆకాశంలోకి ఎత్తి పొడుగ్గా ఆలోచిస్తా ఉంటే నేనే అన్నాను– 'మావా. నువ్వే ఎట్టాగైనా మీ నానమ్మని ఒప్పించాలిరా. నేను వచ్చేటట్టు చూడాలిరా. కావాలంటే నా చాప నేను తెచ్చుకుంటా. నా దిండు నేను తెచ్చుకుంటా. రాత్రిళ్లు తాగేదా నికి నా మంచినీళ్లు కూడా నేనే తెచ్చుకుంటా. మాటలతో నీ చదువు చెడగొట్టనని ఒట్టేసి చెప్పమంటే నీ మీద ఎందుకుగానీ ఆమె మీదే ఒట్టు కూడా వేసి చెప్తా. నన్ను ఎట్టాగైనా పైకి ఇన్‌క్లూడ్ చెయ్యమని మీ నానమ్మకి చెప్పరా. కాదూ కూడదంటే మా యింటిమీదకి వచ్చి చదువుకునేదానికైనా పర్మీషను సంపాదించరా' అని బతిమిలాడినాను.

శ్రీదరుగాడు కూచుని కూచుని ఊ అంటా పొడుగ్గా గాలి ఒదిలి ఎళ్లిపోయినాడు. ఆ తర్వాత ఏం తిప్పలు పడినాడో ఏమోగానీ లిస్టులో నా పేరు ఓకే చేయించుకొని వాళ్ల నానమ్మ చేత సంతకం పెట్టించుకుని హుషారుగా వచ్చినాడు మా కాడికి.

'ఎట్టరా. ఎట్ట చేసినావురా యవ్వారం' అని అడిగినాము మేము.

'ఏముందిరా ఒక రోజు అన్నం మానేశా. ఒక రోజు కూర మానేశా. రెస్పాన్సు లా. ఇట్ట గాదని ఒక రోజు పెరుగు మానేశా. మా నానమ్మ ఏది మానేసినా ఊరుకుంటుందిగానీ పెరుగు మానేస్తే ఊరుకోదు మావా. ఒంటికి వేడి తగులుద్దని బయ్యం. దెబ్బకి ఒప్పుకు నింది. అయితే ఒక షరతు మావా' అన్నాడు వాడు.

'ఏంది మావా' అన్నాను నేను గుండెలు గుబాగుబామంటా ఉంటే.

'మా నానమ్మ రాత్రి ఏడూ ఏడున్నరకల్లా అన్నం తినేసి పొణుకునేదానికి లోపలికి పోతుంది గదా. ఆ తర్వాతే నువ్వు రావాల. పొద్దున ఐదు ఐదున్నరకల్లా లేస్తుంది గదా. ఈలోపలే నువ్వు మీ యింటికి ఎళ్లిపోవాలా' అన్నాడు వాడు.

'మొత్తం మీద మీ నానమ్మ కంట పడకూడదు. అంతేగదరా' అన్నాను నేను కచ్చగా.

'ఉరామారిగా అంతేమావా' అన్నాడు వాడు.

'సరేరా. అట్టాగే కానీరా. ఈ రోజు యిట్టా ఉన్నానుగానీ ఏనాటికైనా నా రోజంటూ ఒకటి వస్తుందిరా. అప్పుడు తెలుస్తుందిరా మీ నానమ్మకి నా పవరేంటో. నేను కూడా పెద్దయ్యి ప్రయోజకుణ్ణయ్యి టక్కులు చేసి నలుగురిలో మరేదా మన్ననా సంపాయించు కుని తిరగతా ఉంటే అప్పటిగ్గాని మీ నానమ్మ కళ్లు తెరుచుకోవురా. అప్పుడామె నన్ను చూసి అయ్యో ఈ మహానుబావుణ్ణా అలనాడు అన్నేసి మాటలన్నదీ, అయ్యో ఈ కదీరు గాణ్ణా ఇంటికొస్తే చీపురుకట్ట తిరగేసి తరుముకున్నదీ అని పచ్చాత్తాపం, ప్రాయచ్చిత్తం, పరోపకారం యిదం శరీరం అన్నీ పడుతుందిరా' అన్నాను జరగబోయేది చెప్పే బ్రమ్మంగా రిలాగా చేతులు రెండూ పైకెత్తి.

'అప్పటి సంగతి అప్పుడురా. ముందు యిప్పటి సంగతి చూడరా' అన్నాడు కాండూరి మురళీగాడు.

సరేరా అని కంబైన్డు స్టడీకి ప్లాను చేసినాను.

రోజూ రాత్రి ఎనిమిది గెంటలకి అందరం అన్నాలు తినేసి శ్రీదరోళ్ల మిద్దె మీద కలుస్తాం. ఎనిమిది నుంచి తొమ్మిది దాకా ఫస్టు లెక్కలు. నలుగురం కూచుని డిస్కసు చేసుకుంటా డౌట్లు తీర్చుకుంటా ఒక్కో చాప్టరులోని ఇంపార్టెంటు లెక్కలన్నీ సాల్వు చేసుకోవాల. తొమ్మిది నుంచి పది దాక ఇంగిలీషు. టెక్స్టు, నాన్ డీటెయిలు, పొయెమ్సు అన్నీ ఒకరికొకరం ఒప్ప చెప్పుకోవాల. అంతేగాదు స్పెలింగులు గుర్తుండేదానికి పలకల మీద రాసి చూపించుకోవాల. పది నుంచి పదిన్నర దాకా బ్రేకు. ఈ టైములో మనం అంజీ హోటలు దాకా పొయ్యి టీ తాగి రావచ్చు. లేదంటే ముందే తెచ్చి పెట్టుకొని ఉన్న నిమ్మకాయలు పిండుకొని చక్కెర కలుపుకొని తాగవచ్చు. కాసేపు ఆ మాటలు ఈ మాటలు చెప్పుకోవచ్చు. పదిన్నర నుంచి యింక ఎవరి ఓపికని బట్టి వాళ్లు ఎవరికి ఏది యిష్టమైతే అది చదువుకొని పొణుకోవాల. అదీ ప్లాను.

ఈ ప్లానంతా సెట్టు చేసింది నేనే. ఎందుకంటే ఈ పద్ధతిలో అయితే మనం వీక్‌గా ఉన్న లెక్కలు, ఇంగిలీషులో అందరి హెల్పుతో స్ట్రాంగ్ అయిపోవచ్చు. తక్కిన సబ్జెక్టుల్లో మనం పర్వాలేదుగాబట్టి మన పాటికి మనం చదువుకొని స్ట్రాంగ్ కావచ్చు.

కానీ దీని ఎనక యింత కుట్ర ఉందని వాళ్లకేం తెలుసు. అబ్బా సూపరుగా ఉందిరా ప్లాను అని దానినే ఒకే చేసినారు.

కంబైన్డు స్టడీ మొదలయ్యింది.

శ్రీదరోళ్ల మిద్దె మీద మా చాపలు, దిండ్లు, పుస్తకాలు చేరినాయి. వైరులాగి బల్బు ఎలిగించినాము.

మా పాతూరులో శ్రీదరోళ్ల మిద్దె దాటితే ఆ ఎనక పక్కంతా పొలాలు. వరిచేలు. ఆ చేల మీద చల్లగా కాసే ఎన్నెలా. రాత్రవంగానే పరుగు పరుగున వచ్చి వాటేసుకునే సముద్రపు గాలి...

చదువుకునేంత సేపు బలే హాయి. చదువుకుని ఒకరి మీద ఒకరం కాళ్లేసుకుని పొణుకున్నాక కమ్మగా పట్టే నిద్రకి యింకా హాయి.

ఆ హాయిలో ఆ ఆనందములో రోజులు యిట్టాగే గడిచిపోతే బాగుండు... కాలం యిట్టాగే ఆగిపోతే బాగుండు అని మేమంతా అనుకుంటా ఉండగా దేవుడు మా మీద కళ్లు ఎర్రంగా చేసుకొని మద్యలో దూరినాడు.

కంబైన్డు స్టడీకి అంతా సెట్టయ్యి ఒక దిగులు తీరిందికదా అనుకుంటా ఉంటే ఇంకో గుబులు పెట్టినాడు. ఆ గుబులు పేరు 'శ్రీదరోళ్ల అక్క'.

శ్రీదరోళ్ల అక్క శ్రీసుద శ్రీదరుగాడికంటే ఒక సంవచ్చరమో రెండేళ్లో పెద్దది. పొడుగు పొడుగు జడలేసుకొని మనోరంజని పూలుబెట్టుకొని యింట్లో టకాటకా నడస్తా ఉండేది. మేము టెన్తులో ఉంటే ఆమె జూనియరు ఇంటరు. బైపిసి. వాళ్లకి కూడా పరీక్షలు ఒకటి రెండు నెలల్లో ఉంటాయిగానీ మా అంత అర్జెంటు కాదు. అయితే మేము నలుగురం

కంబైన్డు స్టడీ మొదలెట్టేసరికి శ్రీదరోళ్ల అక్కకి కూడా ముచ్చటేసి ఆమె కూడా కింద వరండాలో ట్యూబులైటు ఏసుకొని చదవడం మొదలుబెట్టింది.

సరిగ్గా ఆ పాయింటు కాడ వచ్చింది చిక్కు.

శ్రీదరోళ్ల అక్కకి మనసులో చదువుకోవడం రాదు. పెద్దగా చదవాల్సిందే.

బవంతులు కూలతాయా, పెంకులు రాలిపోతాయా, చెట్లు ఆవొంతిన కొమ్మలు యిరుచుకొని మొదళ్లు ఊడపెరుక్కొని కిందపడిపోతాయా అన్నట్టుగా ఓ అంటా ఇంత పెద్ద గొంతుతో ఇంటరు పాటాలు చదవడం మొదలుబెట్టింది శ్రీదరోళ్ల అక్క.

మేము లెక్కలు ఏసుకుంటా ఉంటే మద్యలో శ్రీదరోళ్ల అక్క గొంతు. మేం ఇంగిలీషు చదవతా ఉంటే శ్రీదరోళ్ల అక్క గొంతు. మేము సైన్సు సోషలులో ఉన్నా శ్రీదరోళ్ల అక్క గొంతే.

ఆ గొంతు యినీ యినీ, ఆ పాటలు చెవుల్లో పడీ పడీ 'మావా. టెన్తు కిలాసు పరీక్షలు ఏమోగానీ మనందరం ఇంటరు ఫస్టియరు పరీక్షలకి గనక కూచుంటే నూటికి నూరు మార్కులు సంపాయిచ్చేట్టున్నాము మావా' అన్నాను నేను శ్రీదరుగాడితో.

'అవును మావా. మీ అక్క పాటాలు యింటా ఉంటే నాకొచ్చింది కూడా పోతా ఉంది మావా' అన్నాడు కందుల ఫాలకొండరావుగాడు బిక్కు బిక్కుమంటా.

'నేనైతే చదవడం మానేసి, మీ అక్కొళ్లి నిద్దర పోయినాకే పుస్తకం తెరస్తా ఉన్నాను మావా' అన్నాడు మురళీగాడు.

శ్రీదరుగాడు మా అందరి వంకా చూసినాడు.

'తప్పదురా. మనం అడ్జస్టు అవ్వక తప్పదు. ఇప్పుడేం చూశార్రా. పోయిన సంవచ్చరం మా అక్క టెన్తు కిలాసులో ఉన్నప్పుడు రోజూ మా యింటి మీదుగా పాలకి బరెగొడ్లు తోలుకొనిపోయే ఒకామె మా అక్క చదివేది యినీ యినీ ఒక ఇంగిలీషు పాయెము కూడా ఒప్పచెప్పేసిందిరా. మా అక్క పుస్తకం తెరిచిందంటే చుట్టుపక్కలోళ్లు కిటికీలు మూసుకోవాల్సిందే మావా. అంత హడలురా' అన్నాడు.

'దీనికి యిరుగుడన్నదే లేదంట్రా?' అన్నాను లేదు.

'లేదురా. పాపం మా అక్క ఎన్నోసార్లు ట్రయి చేసింది. కానీ మనసులో చదవడం రావడంలా. పెద్దగా చదివితేనే గుర్తుంటుందంట' అన్నాడు శ్రీదరుగాడు.

అందరం ఆలోచన చేసినాం- మేము కనిపించినప్పుడల్లా వాళ్ల ఫ్రిజ్జులో దాచిపెట్టున్న పెరటి జాంకాయలో, జామెట్రీ బాక్సులో అట్టి పెట్టుకొని ఉన్న చాక్‌లేట్లో యిచ్చి శ్రీదరుగాడితో సమానంగా మమ్మల్ని కూడా చూసే శ్రీదరోళ్ల అక్కని కాదని కంబైన్డు స్టడీ మానేసి పోవడమా? లేదా ఈ సొండ్లని తట్టుకుంటా యిట్లాగే అడ్జస్టు కావడమా?

రెండోదే మేలు అనుకున్నాం.

ఆ మరుసటి రోజు నాకు తెలిసిన ఆర్‌ఎంపి డాక్టరు కల్లయ్య కాడికి పోయి గుప్పిట నిండుగా దూది తెచ్చినాను.

రాత్రవడం. కంబైన్డు స్టడీకి మేమందరం కలవడం. శ్రీదరోళ్ల అక్క దెబ్బకి చెవుల నిండుగా దూది పెట్టుకోవడం చదువుకోవడం.

చెవుల్లో దూది ఉండీ ఉండీ దానిని గట్టిగా లోపలికి దూర్చి దూర్చి కొన్నాళ్లకి మా మాటలు కూడా మాకు యినిపించక మేము కూడా శ్రీదరోళ్ల అక్క లెవిల్లో పెద్దగా చదవడం మొదలుబెట్టినాం.

ఆ గోలా ఈ గోలా కలిసి మా దెబ్బకి చుట్టుపక్కలోళ్లు మిద్దెల మీద పొణుకోవడం మానేసినారు.

వాళ్ల పిలకాయల చదువులు వాళ్లకి గుర్తున్నాయో లేవో గానీ పాపం మా కంబైన్డ్ స్టడీలు మాత్రం వాళ్లకి ఇప్పటికీ గుర్తేనబ్బా.

■